
కథానిక



# గిత్తల బేరం

## మధురాంతకం రాజారాం

'నాయనా రత్నం ! ఎప్పుడు రావడం ? రారా కూచో. బాగున్నావా ? ఇప్పుడేమైనా లీవులా మీకు ? ఎన్ని రోజులుంటావు ?' - మా పెదనాన్న గారు పలకరిస్తే అది పరామర్శలా వుండదు. పన్నీరు చిలకరించినట్టుగా వుంటుంది.



"పొట్టిచేతి రవికలాయె
పొడుగాటి షరాయిలాయె
సైకిలెక్కి తిరుగుటాయె
చలువకళ్ళ సోకులాయె
ఎంత చిత్ర మాయెరా
ప్రపంచం"

రెండు మూడు బస్సులు మారి నేను మావూరు చేరుకునే సరికి మధ్యాహ్నం కావస్తుంది. భోంజేసి పడుకుని ఒళ్ళెరగకుండా నిద్రపోతాను. ఎండ బాగా తగ్గిన తర్వాత లేచి బయటికి వచ్చి పక్కింటివైపు తొంగి చూస్తాను. ఏదైనా పత్రిక తిప్పడం, లేదా పంచాంగం చూడడం, లేక గ్రామస్తులెవరితోనైనా మాట్లాడడం - ఇలా ఏదో ఒక పనిలో నిమగ్నులై అరుగు పైనే కూర్చొని వుంటారు పెదనాన్న గారు. నన్ను చూసే సరికి ఆయన ముఖంలో ఆనందపు వెలుగులు సందడిస్తాయి. రక్త బంధుత్వ మొకటే అందుకు కారణమనుకోరాదు. మరొక ఆంతరంగిక హేతువుంది. స్వానుభవాలను కథలు కథలుగా అల్లి చెప్పే చాతుర్యం మా పెదనాన్న గారి సొత్తు. ఆ ఉదంతాలను అత్యంత శ్రద్ధతో, ఆసక్తితో వింటా నన్నది నాకున్న కితాబు! భోజరాజును చూడగానే కవిత్వం పుట్టుకొచ్చినట్టుగా నేను కనిపించగానే ఆయనకు చెప్పదగిన విశేషమేదైనా స్ఫురిస్తుంది.

ఒకసారి ఆయన ఇరవయ్యో శతాబ్దంలో మానవ నాగరికతా ప్రస్థానాన్ని గురించి పాఠం తీసుకున్నారు. మా పెదనాన్న గారు పుట్టింది 1915లో. ఆయన్ను ప్రస్తుత శతాబ్దికంతా ప్రతినిధిగా పేర్కొనడంలో తప్పేమీ లేదు. మొదటి ప్రపంచయుద్ధం జరుగుతుండగా పుట్టాడు. రైళ్ళు, బస్సులు, విమానాలు రావడం ఆయన జీవిత కాలంలోనే ! తొలి సారిగా కరెంటు దీపాలు వెలిగినందుకు ఆకాశ వాణి భూమీ తలంపైకి దిగి వచ్చినందుకు, బయోస్కోపులో బొమ్మలు మాట్లాడినందుకు ప్రత్యక్ష సాక్షి ఆయనే ! రూపాయ కట్టలంతా రెండు రూపాయల నెలసరి చందాతో మదరాసు నుంచి పోస్టులో దినపత్రిక తెప్పించుకున్న ప్రముఖుడు మా పెదనాన్నగారే ! నాగరికతా పరిణతిని గురించి, ఏ విశ్వ విద్యాలయమైనా ఒక సెమినార్ ఏర్పాటు చేస్తే అందులో గ్రామ సీమల్లో వచ్చిన మార్పుల్ని గురించి పత్ర సమర్పణ చేయగల అధికారం, అర్హత కలిగిన బుద్ధ జీవిగా మా పెదనాన్న గారిని పేర్కొనవచ్చు. ఏందోరా చెప్తాను ? పాఠం తీసుకున్నాడని చెప్పాను గదూ ! అక్కడి నుంచి కొనసాగిస్తున్నాను.


'నాయనా రత్నం! మా చిన్న తనంలో ఒక పాట బహుళ వ్యాప్తిలో వుండేది. ఎంత చిత్రమాయెరా ప్రపంచం ఆహా - ఎంత చిత్రమాయెరా ప్రపంచం. పొట్టి చేతి రవికలాయె, పొడుగాటి షరాయిలాయె. సైకిలెక్కి, తిరుగుటాయె, చలువ జోళ్ళ సోకులాయె - ఎంత చిత్రమాయెరా ప్రపంచం... అని చిత్ర

మేమంటే ఈ నాడు సర్వ సామాన్యంగా తోచే విషయాలే అప్పట్లో పెద్ద వైపరీత్యాలుగా వుండేవి. అక్కడి నుంచి బయల్దేరిన నాగరికత వచ్చి వచ్చి ఈ నాడెక్కడికి చేరుకున్నదో తెలిస్తే మనం ఆశ్చర్య సముద్రంలో బుడుంగున మునిగిపోక తప్పదు. ఇటీవల ఒక నిద్ర పట్టని రాత్రివేళ ఉన్నట్టుండి మనసుకొచ్చింది. రాగానే నీతో చెబుదామనుకున్నా. వచ్చేశాను...'

'చెప్పండి' అన్నాను.

'బాగా అయిదేళ్ళొచ్చే దాకా మమ్మల్ని బడిలో వేసే వాళ్ళు కాదు. తరగతులా, పాఠాలా పరీక్షలా – అదేం లేదు. అయ్యవారేది చెబితే అది నేర్చుకోవడమే ! మానాగు మీసాలొచ్చాకనే బడి నుంచి విడుదల. ఆ దశలో ఒక సంవత్సరం పాటు నేను బురకాయల కోటలో మా మేనమామ గార్ల ఇంట వుండిపోయాను. ప్రో నోట్లు చూసి వడ్డీ లెక్క గట్టడం, భూముల్ని కొలిచి విస్తీర్ణం గణించడం, దస్తా వేజులు రాసే తీరు తెన్నులు నేర్చుకోవడం – ఈ లౌకిక వ్యాసంగాల్లో నేను మా పెద మామ గారి దగ్గర తరిఫీదు! పొందాలని మా నాన్న గారి కోరిక. మా పెద మామ కోడెల వుల్లంరాజు బహు కుటుంబీకుడు. ఇంటా బయటా గూడా గెల్చిన వాడు. అంటు జోళ్ళతో, మెడ కంటెతో, రవ్వల మురుగులతో, గిరజాల జుత్తుతో బొద్దు మీసాలతో, ఇనుప తలుపు లాంటి ఛాతీతో కోట బురుజుపైన పహారా సిపాయిలా వుండే వాడు. బురకాయల కోట నుంచి అడ్డదారి పైన వెళితే మదనపల్లికి ఇరవై మైళ్ళుంటుంది. మా మామ గుర్రమెక్కి కూచున్నాడంటే రెండో గంట మునిగే టప్పటికల్లా మదనపల్లిలో వుండేవాడు. పది మడకల సేద్యమంటే ఏమిటో చెప్పగలవా ? పదెకరాల సేద్యమైతే అది ఒక మడక సేద్యం. మిట్టా, పల్లం అంతా కలసి నూరెకరాలు దాటితే అది పది మడకల సేద్యం. మా వుల్లంరాజు మామ గారిది పది మడకల భారీ సేద్యం. వాళ్ళ యింటి పేరు వేరే వుందిలే ! కానీ కోడెల వాళ్ళు అని పేరు రావడానికి కారణం ఆయన దగ్గరుండే కోడెలకు దీటైన కోడెలు ఆ యిలాకాలో మరెక్కడా లేకపోవడమే ! బేరమొస్తే ఆయన అమ్మెయ్యడానికీ వెనుదీసే వాడూ కాదు, అమ్మేశాక దేశంపైన పడి తనకు నచ్చిన కోడెల్ని పట్టి తెచ్చి కొట్టంలో కట్టేసే దాకా నిద్ర పోయే వాడూ కాదు. రూకలు దట్టించినవల్లె దట్టీలా నడుముకు బిగించి వస్తాదులు కూచున్న సవారీ బండి వెంట రాగా ఆయన గుర్రంపైన ఎద్దుల బేరానికి బయల్దేరే వైనం చూచి తీరాల్సిందే ! అన్నట్టొకసారి ఆయన పరివారంతో కలసి గిత్తల బేరానికి వెళ్ళిన అనుభవం నాకున్నూ వుండిపోయింది. అదే నేనిప్పుడు చెప్పదలచుకున్నది...'

అరుగు దిగి వెళ్ళి తాంబూల చర్వణం వేసిన నోటిని నీటితో కుప్పలించి, ముఖం కడుక్కొని తిరిగి వచ్చి కూచున్నారు మా పెదనాన్న గారు.




డా. ఎన్. గోపి

ప్రక్కనే వుంచుకున్న చిన్న పెట్టెలో నుంచి ఆకులు, వక్కలూ, సున్నమూ తీసుకొని మళ్లీ తాంబూల చర్వణానికి ఉపక్రమించారు. సినిమాలో విరామం ఎలాంటిదో, కథా గమనంలో మా పెదనాన్న గారు తాంబూలం వేసుకోవడం అలాంటిదే. కథ సగం దాకా పూర్తయినట్టు!

'మీ పెదనాన్న గారి పరివారంతోకలసి ఒక సారి మీరు గూడా గిత్తల బేరానికి బయల్దేరి వెళ్ళినట్టు చెప్పారు...' అంటూ పూర్వా పరాలకు ముడి వేశాను.

'హాయల్వాడు సమీపం తరిగొండలో బాణాల గోవిందరెడ్డి దగ్గర ఒక కాడి గిత్తలు మంచి హుమ్మ స్సువైన వున్నాయని తెలిసింది. బురకాయలకోటలో తెల్లవారు జామున బయల్దేరి మధ్యాహ్నానికంతా తరిగొండ చేరుకున్నాము. భోజనానంతరం కొట్టం లోకి వెళ్ళి గిత్తల్ని చూశాము. ఔరా ! అదేం కోడెలోరా నాయనా ! సీసంతో పోత పోసినట్టు న్నాయి. పసందైన రొమ్ము బలం. నునుపు దేలిన రొమ్ములు. ఇనుప గుదియల్లాంటి కాళ్ళు. కానీ ఎన్ని వుండి ఏం లాభం ? పొరక సుడి అంటూ ఒకటి వుండిపోయిందే ! పొరక సుడి వుంటే ఇల్లంతా పొరకతో తోసి పారేసినట్టే నంట గదా! మామగారి ముఖం చిన్నబోయింది...'

'అరరే, అయ్యో పాపం ! ఎంత పని జరిగి పోయింది' అంటూ కథా పరిణామంలో ఆసక్తి వెల్లడించుకున్నాను.

'మా మరునాటి మజిలీ గుర్రంకొండ. మొలక వేముల చెన్నరాయప్పంటే పశువుల పెంపకంలో సహదేవుడే ! అతడి దగ్గర కోడెలు కొమ్ములు గనుక లేకపోతే అరబ్బీ గుర్రాలే ! వీపు పైన నాలుగు మూటల బెల్లం వేసినా జగ్గే దిట్టు లేవు. రంకె వేశాయంటే లేపాక్షిలో బసవయ్య ఉలికి పడాల్సిందే ! అయితే మా మామ అంతకూ యింతకూ ఒప్పకునే వాడు కాదు గదా ! నోరు తెరచి చూచినాడు గదన్నా, దాపటెద్దుకు క్రింది వరుస ఎనిమిది పళ్ళలో ఒకటి సీదాగా విరిగిపో యింది. పలు వరుస సరిగ్గా లేని గొడ్డును ఆయన తాకనైనా తాకే వాడు కాదే !

'అక్కడి నుంచి కలకడ, కోన, నంబేపల్లెల మీదుగా రాయచోటి చేరుకున్నాము. అక్కడ పశు వుల పెంపకంలో గాలివీడు ఇబ్రహీం సాయిబుది పెట్టింది పేరు. అయిదు వేళలా నమాజెట్లా చేస్తాడో అయిదు వేళలా గిత్తలకు కుడితి నీళ్ళు పెడతాడు. అందులో ఏయే దినుసులు కలుపుతారో తెలియదు. గిత్తలు మూతులు పెడితే చివరి చుక్క దాకా పీల్చేస్తాయి. రోజు మార్చి రోజు మాలీసు చేయిస్తాడు. నెలకొకసారి కొమ్ములు సున్నగా జివిరి రంగులు వేయిస్తారు. అతని కొట్టంలో మేము చూసిన కోడెలు నటుపటంగా లేవు. నందీశ్వరు డికి దాయాదుల్లా వున్నాయి. అయితే పగ్గాలు విప్పి కోడెల్ని బయటికి తోలిన తర్వాత తెలిసింది. వలపటెద్దు కొంచెం కుంటుతూ నడుస్తుంది. ఈ అవలక్షణాన్ని 'మందకొడి' అంటారు...

'బయల్దేరిన వేళా విశేషం మంచిది కాదేమోనని మేము బురకాయల కోటకు తిరుగుదారి పట్టాము. వారం రోజుల తర్వాత మళ్ళీ మదనపల్లి మీదుగా పుంగనూరు, పలమనేర్కు, వి.కోట, రాయలపేట, ఇట్లా ఆ పక్క ఊళ్ళన్నీ తిరిగి చూశాము, అయినా మా మామ గారు కోరిన కోనలో వాన మాత్రం కురిసిందే గాదు. ఆ పైన మూడు నెలల్లో నాలుగు దిక్కులూ తిరిగొచ్చేసినాము. ఒక చోట సంకెళ్ళ సుడి, ఇంకొక చోట గూటం సుడి, మరొక చోట గిత్త నెమరు వేసేటప్పుడు బుస పెట్టడం, రొమ్ము వాటం బాగుండక పోవడం...

'చివరికెల్లాగో బీరంగి కొత్తకోటలో మా మామ గారి కన్నివిధాలా నచ్చిన కోడెలు దొరికిపోయాయి ? – కరెంటు పోగానే ఆగిపోయే సినిమాలా పెదనాన్న గారి కథ హఠాత్తుగా ఆగిపోయింది.

నేను మా పెదనాన్న గారి వైపు తెల్లబోయి చూడసాగాను. కోడెల బేరం గురించి యింత వివ రంగా చెప్పడంలో ఆయన ఆంతర్యమేమిటో నాకు బోధపడడం లేదు. నా ఇంగితం గ్రహించినట్టుగా ఆయన కూడా అంది పుచ్చుకున్నాడు.

'ఎందుకు చెప్పకొచ్చినానంటే ఈ మధ్య మన వూళ్ళో అలాంటి తతంగమేదో జరిగింది. మిద్దింటి శ్రీమన్నారాయణ కొడుకు హరిప్రసాద్ లేడా, రెండు వారాల లోపులో అమెరికా నుంచి స్వదేశానికి వచ్చాడు. కారుపైన తిరుగుతూ రెండు రోజుల్లో పది సంబంధాలు దాకా చూసేశారు. వధూవ రులు ఒకరి అభిరుచిని మరొకరు గ్రహించడానికి వ్యవధి లేని పరిస్థితి. ప్రేమించి పెళ్ళి చేసుకోడమన్న మాటకే ఆస్కారం లేదు. వరుడికి కావలసింది విదేశాల్లో ఉద్యోగం చేయడానికి తాహతున్న భార్య. వరుడి తల్లిదండ్రులకు కావలసింది కట్నాలూ, లాంఛనాలూ. ఆ రెండు షరతలూ నెరవేరిన చోట సంబంధం ఖాయపరచుకున్నారు. వారం రోజుల వ్యవధిలో ముహూర్తం పెట్టుకున్నారు. మంగళ సూత్రధారణ కాగానే రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళి పెళ్ళిని చట్టబద్దం చేసుకున్నారు. మరునాడు మద్రాసుకు వెళ్ళి పెళ్ళి కుమార్తెకు వీసా పుట్టించు కున్నారు. ముచ్చటగా మూడు రాత్రులు మాతృ భూమిలో గడిపిన తర్వాత వధూవరులు పద్నాలుగో నాటి సాయంత్రం షికాగోకు విమానమెక్కేశారు. ఏం నాయనా ! ఎంత చిత్రమాయెరా ప్రపంచం – అన్న పాటను ఇప్పడెట్లా సవరించుకోవాలో చెప్పగలవా ? – ప్రశ్నిస్తున్నారు పెదనాన్నగారు.

ఏమని బదులు చెప్పగలను ! ఆశ్చర్యాతిరేకం వల్ల మాట పెకలింది కాదు. స్తంభీ భూతుడినై శిలా విగ్రహంలా వుండి పోయాను.

# రెండు వైఫల్యాలు




ఉత్తరాలలో ఉభయ కుశలోపరి
అలవాటు మాత్రమే.

శిథిల నేపథ్యం, చిరకాలిక హేయ ముద్రలు–
ప్రతిదిన యుద్ధారంభం.
బహుశా, యుద్ధం ముగిసిపోతుందని
ఎవరూ చెప్పలేరు.

నిన్నటి మిత్రుడే
ఇవాళ శత్రువైతే
ఆశ్చర్యం లేదు.
స్వార్థాహంకార ప్రకోపమే
అసలు రుగ్మత.

రెండు వైఫల్యాలు:
పీడితుడు పీడితునిగా మిగలడం.
పీడితుడు పీడకునిగా మారడం.

–గాలి నాసరరెడ్డి